సాక్షి సూర్యాపేట

ఆదివారం । 12 । మే । 2024



ర్యాండమైజేషన్ పూర్తి
నల్లగొండ కలెక్టరేట్‌లో శనివారం పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ అధికారుల సమక్షంలో పూర్తిచేశారు.

- 2లో



కాంగ్రెస్‌కే బ్రాహ్మణుల మద్దతు
బ్రాహ్మణుల మద్దతు కాంగ్రెస్‌కే ఇస్తున్నట్లు అఖిల బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలరావు తెలిపారు.

- 2లో

గరిష్టం / కనిష్టం
39^{0} / 28^{0}

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం పాక్షికంగా ఎండ ఉంటుంది.

న్యూస్‌రీల్

ఓటుహక్కు వినియోగించుకోవాలి

తుంగతుర్తి: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత కోరారు. శనివారం తుంగతుర్తి లోని మైనారిటీ గురుకుల పాఠశాల నుంచి సిరి ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించిన బైక్‌ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదన్నారు. మీ ఓటు మీ ఇష్టం మీ కర్తవ్యం అని ఆమె అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎండ వేడి లేకుండా టెంట్లు తాగునీరు కల్పించామని తెలిపారు . ర్యాలీలో తహసీల్దార్ రమణారెడ్డి, ఎస్ఐ ఏడుకొండలు తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, యువకులు ప్రజలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



మునగాలలోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జగదీశ్వర్‌రెడ్డి

మునగాల: పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి కె.జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. లోక్‌సభ ఎన్ని కల నేపథ్యంలో మునగాల మండలంలోని బరాఖత్ గూడెం, మునగాల, గణపవరం, తిమ్మారెడ్డిగూడెం,కొక్కిరేణి, మాధవరం గ్రా మాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తున్న వసతులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మా ట్లాడారు. ఆయన వెంట మండల అభివృద్ధి అధికారి కె.రమేష్ దీనదయాళ్, ఆర్ఐ రాధారెడ్డి, ఎంపీపీ బృందం, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలు, విద్యుత్ శాఖ, ఆయా గ్రామపంచాయతీల సిబ్బంది ఉన్నారు.

ష్.. గప్‌చుప్!



తిరుమలగిరిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

శనివారం సాయంత్రం ముగిసిన లోక్‌సభ ఎన్నికల ప్రచారం

- చివరిరోజు బైక్ ర్యాలీలు, రోడ్‌షోలతో హోరెత్తించిన పార్టీలు
- అభ్యర్థులు, నేతల సుడిగాలి పర్యటన
- ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు పార్టీల ఎత్తులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : లోక్‌సభ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. చివరి రోజు అన్ని పార్టీలు ముమ్మర ప్రచారం చేశాయి. పట్టణాలు, గ్రామాల్లో భారీ బైక్ ర్యాలీలు నిర్వహించాయి. అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేయడంతోపాటు.. నేతలు కూడా సుడి గాలి పర్యటనలు చేశారు. ప్రచారం బంద్ కావడంతో మైకులన్నీ మూగబోయాయి. ఇక, ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు ఎత్తులు వేస్తున్నారు.



నకిరేకల్ : రోడ్‌షోకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

నామినేషన్ల ఘట్టం ముగియగానే..
లోక్‌సభ ఎన్నికల నామినేషన్ ఘట్టం ముగిసిన నాటి నుంచి అన్ని ప్రధాన పార్టీలు ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ముమ్మర ప్రచారం చేశాయి. ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు, ముఖ్య నేతలు, జాతీయ, రాష్ట్ర నేతలు, స్థానిక నాయకులు, క్షేత్ర స్థాయిలో కార్యకర్తల ప్రచారాలతో నిన్నటి వరకు గ్రామాలు, పట్టణాలు హోరెత్తాయి. ఎక్కడ చూసినా పార్టీలు, అభ్యర్థుల ప్రచారాల ప్రచార రథాలు మైక్‌లతో వీధుల్లో సందడి చేశాయి.

ఇక ప్రలోభాలతో ఎర..
లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగియడంతో.. ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఓటర్లను ప్రలోభ పెట్టేలా మద్యం, డబ్బు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అక్కడక్కడా మద్యం ఇచ్చేందుకు తీసుకెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆయా పార్టీలు అసెంబ్లీ ఎన్నికల తరహాలో కాకపోయినా.. ఎంతో కొంత పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. మద్యంతోపాటు అంతటా ఓటర్లకు 300 రూపాయలు ఇవ్వాలని ఆయా పార్టీల నేతలు చర్చించుకున్నట్లు తెలుస్తోంది.

మద్యం షాపులు బంద్
పోలింగ్‌కు 48 గంటల ముందుగానే మద్యం షాపులు కూడా బంద్ అయ్యాయి. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి సోమవారం సాయంత్రం 7 గంటల వరకు మద్యంషాపులు, బార్‌లు మూసివేయనున్నారు. దీంతో శనివారం వైన్స్‌ల వద్ద మద్యం ప్రియులు బారులుదీరారు.

చివరి రోజు భారీగా ర్యాలీలు
శనివారం ప్రచారానికి చివరి రోజు కావడంతో అన్ని రాజకీయ పార్టీలు పట్టణాలు, గ్రామాల్లో భారీ ఎత్తున ర్యాలీలు, బైక్ ర్యాలీలు చేశారు. వార్డులు, వీధుల్లో పెద్ద ఎత్తున కార్యకర్తలతో ఆయా పార్టీలు జెండాలు పట్టుకొని ప్రచారం చేశారు.

- మిర్యాలగూడలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సీపీఎం నేత జూలకంటి కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. భువనగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. మునుగోడులో కాంగ్రెస్ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి.. చౌటుప్పల్, మునుగోడులో ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. హుజూర్‌నగర్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కు మద్దతుగా లాయర్లు బైక్ ర్యాలీ నిర్వహించారు. నల్లగొండలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి ప్రచారంతోపాటు బైక్ ర్యాలీలు చేపట్టారు.
- బీజేపీ అభ్యర్థి శానంపుడి సైదిరెడ్డి సూర్యాపేటలో ప్రచారం నిర్వహించారు. ఆయన తరఫున బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నమలై రోడ్‌షోలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ శ్రేణులు, సూర్యాపేటతోపాటు నల్లగొండలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మునుగోడు నియోజకవర్గంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.
- నకిరేకల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని కోరుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

• ఎన్నికల రద్దీ



హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో నివసించే వారు ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో హైదరాబాద్-విజయవాడ హైవేపై పంతంగిటోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులుదీరాయి.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తాం

- జిల్లా ఎన్నికల అధికారి వెంకటరావు



కలెక్టరేట్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేట : జిల్లాలో ప్రశాంతంగా లోక్ సభ ఎన్నికలు నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కెమెరాలను పరిశీలించి మాట్లాడారు. ఈనెల 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఉంటుందని, సాయంత్రం 6 గంటల లోపు పోలింగ్ కేంద్రం పరిధి లోనికి వచ్చిన వారికి టోకెన్లు ఇచ్చి ఓటు వేయడానికి అవకాశం కల్పిస్తామన్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి అన్ని అసెంబ్లీ నియోజక వర్గాలకు ఈవీఎంలను పంపించామని, ఆదివారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ల నుంచి ఆయా పోలింగ్ స్టేషన్లకు ఎన్నికల సిబ్బంది తోపాటు ఈవీఎంలు చేరుకుంటాయని తెలిపారు. జిల్లాలో 1,201 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీటిలో 229 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ఇక్కడ నిఘా పెంచినట్లు చెప్పారు. అలాగే 112 రూట్లలో 123 మంది సెక్టార్ అధికారులను నియమించామన్నారు. అభ్యర్థులు శనివారం సాయంత్రం 6 గంటల నుంచి తమ ప్రచారాలు ముగించారని తెలిపారు. ప్రచారాలు ముగిసిన సమయం నుంచి పోలింగ్ పూర్తయ్యేంతవరకు జిల్లాలో మద్యంపై నియంత్రణ ఉంటుందన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడానికి అవగాహన కార్యక్రమాలు చేపట్టామని, యువ ఓటర్లు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని పోలింగ్ స్టేషన్ల వద్ద నీడ, తాగునీటి సదుపాయాలు కల్పించామన్నారు. దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేకమైన సదుపాయాలు కల్పించామని, వారిని తీసుకొచ్చి, తీసుకెళ్లడానికి సహాయకులను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా

- ఎస్పీ రాహుల్‌హెగ్డే



హుజూర్‌నగర్‌లో కేంద్ర బలగాలతో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట: జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా పెంచినట్లు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ సిబ్బందికి సహాయంగా 1,100మంది తమిళనాడు రాష్ట్ర హోంగార్డ్స్, అరుణాచల్ ప్రదేశ్ పోలీసులు, 6కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు అందరూ సుమారు 3,500మంది పోలీసులు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్నారని వివరించారు. 11వ తేదీ సాయంత్రం 5గంటల వరకు రాజకీయ పార్టీలకు ఇచ్చిన ప్రచార సమయం ముగిసిందని ఎవ్వరు కూడా ప్రచారం చేయొద్దని సూచించారు. సామాజిక మాధ్యమంలో వాటాప్స్, ఫేస్ బుక్, ఆన్‌లైన్‌లో ఎస్ఎంఎస్ రూపంలో కూడా ప్రచారం చేయకూడదని పేర్కొన్నారు. 144సెక్షన్ అమలులో ఉందని, ఐదుగురి కంటే ఎక్కువగా, గుంపులుగా ఉండవద్దని, సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించవద్దని సూచించారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రచార సమయం ముసినందున ఓటరు కానివారు, స్థానికేతరులు నియోజకవర్గాలు, గ్రామాలు, వార్డులు వదిలి వెళ్లిపోయాలని సూచించారు. 48గంటల నిబంధనలు అమలులో ఉన్నాయని తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద 100మీటర్ల పరిధి ఆంక్షలు అమలు చేస్తున్నామని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 190 ఉన్నాయని ఆయాచోట్ల ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ అనుసంధానం చేసిన సీసీ కెమెరాలతో ఎన్నికల సరళిని జిల్లా పోలీసు కార్యాలయంలో పరిశీలిస్తున్నామని తెలిపారు.

రక్షణ కల్పించడం కేంద్రబలగాల విధి
హుజూర్‌నగర్ : ఎన్నికల అధికారులకు, పోలింగ్ సామగ్రికి రక్షణ కల్పించడం కేంద్ర బలగాల ముఖ్యవిధి అని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న కేంద్ర బలగాలతో శనివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బలగాలు స్థానిక పోలీసులకు సహాయ సహకారాలు అందిస్తూ, పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని సూచించారు. పోలింగ్ పూర్తి అయ్యేవరకు పోలింగ్ కేంద్రాల వద్దనే ఉండాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు, సీఐ చరమందరాజు, ఎస్ఐలు, సెంట్రల్ ఫోర్స్‌అధికారులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సామాజిక న్యాయం

- సైదిరెడ్డిని ఎంపీగా గెలిపించాలి
- సూర్యాపేట రోడ్‌షోలో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై



రోడ్‌షోలో మాట్లాడుతున్న తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై, పక్కన అభ్యర్థి సైదిరెడ్డి

సూర్యాపేట : దేశంలో రాజ్యాంగం బలపడి, సామాజిక న్యాయం జరగాలంటే బీజేపీతోనే సాధ్యమవుతుందని తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఒక్క కుటుంబమే దోచుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక కుటుంబాలు దోచుకుంటున్నాయని విమర్శించారు. బీజేపీ నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం సూర్యాపేటలో నిర్వహించిన రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. నమస్కార్ సూర్యాపేట అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చి ఒక్కటీ నెరవేర్చిందన్నారు. ఎంపీ స్థానాలు గెలిచినా పనులు జరగవన్నారు. బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గెలిస్తే లోక్‌సభ నియోజకవర్గానికి రూ. 4,000 కోట్ల నిధులు వస్తాయని, 50వేల ఉద్యోగాలు యువతకు దక్కుతాయని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లతో ఉపాధి దొరుకుతుందన్నారు. మళ్లీ దేశంలో నరేంద్ర మోదీ ప్రధాని కావాలని ప్రజలకు సిరి సంపదలు కలుగుతాయని దీనికోసం బీజేపీ గెలవాలన్నారు. చాలాకాలంగా మాదిగలకు అన్యాయం జరుగుతోందన్నారు. వర్గీకరణపై బీజేపీ కృతనిశ్చయంతోఉందని దేశంలో మన ప్రభుత్వం వస్తే కచ్చితంగా జరిగి తీరుతుందన్నారు. కర్ణాటకలో, తెలంగాణలో గిరిజనులకు న్యాయం దక్కాలి అంటే బీజేపీ రావాలన్నారు. మోదీ తిరిగి అధికారంలోకి వస్తేనే పేదరిక నిర్మూలన జరుగుతుందన్నారు.



సూర్యాపేటలో రోడ్‌షోకు హాజరైన బీజేపీ శ్రేణులు

దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు : సంకినేని వెంకటేశ్వరరావు
ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. దేశంలో ధర్మం బతకాలంటే మోదీని ప్రధానిగా చేసుకోవాలని ప్రజలను కోరారు. సైదిరెడ్డి గెలిస్తే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు.

దేశం గుండెచప్పుడు మోదీ : శానంపూడి సైదిరెడ్డి
దేశం గుండెచప్పుడు మోదీ.. మోదీ అని అభ్యర్థి సైదిరెడ్డి అన్నారు. నల్లగొండలో కాషాయం జెండా ఎగరాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశాన్ని అమ్ముకుంటుందని, ఆరు గ్యారంటీల పేరుతో 6 అబద్ధాలు చెప్పారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తమిళనాడు ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి, వరంగల్- నల్లగొండ - ఖమ్మం ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, లక్ష్మణ్, శ్రీలత రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఓటర్లను ఆకర్షించేలా...

కోదాడ రూరల్: కోదాడ పట్టణంలో మూడు చోట్ల ఓటర్లను ఆకర్షించేందుకు అధికారులు ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. హుజూర్‌నగర్ రోడ్డులోని ఎస్ఆర్ఎం పాఠశాలలో యువ ఆదర్శ పోలింగ్ కేంద్రం, సీసీ రెడ్డి కాన్వెంట్‌లో మహిళా పోలింగ్ కేంద్రం, అనంతగిరి మండలం శాంతినగర్‌లో దివ్యాంగుల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలను అధికారులు ప్రత్యేకంగా అలంకరించారు.



యువ ఆదర్శ పోలింగ్ కేంద్రం

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

నల్లగొండ: కలెక్టరేట్‌లో శనివారం ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ సమక్షంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తిచేశారు. పోలింగ్ సిబ్బందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయిస్తూ ర్యాండమైజేషన్ చేశారు. కార్యక్రమంలో నల్లగొండ కలెక్టర్, ఎన్నికల అధికారి దాసరి హరిచందన, సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటరావు, నల్లగొండ ఏఆర్ఓ రవికుమార్, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు శ్రీనివాస్, సూర్యనారాయణ, వేణుమాధవ్, ఇన్ఫర్మేటిక్ అధికారి రావులు పాల్గొన్నారు.



ర్యాండమైజేషన్‌లో పాల్గొన్న కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకుడు

● ర్యాలీల జోరు



సూర్యాపేట: ర్యాలీగా వస్తున్న బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి



నకిరేకల్ పట్టణంలో బీఆర్ఎస్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, ప్రజలు



మోత్కూరు పట్టణంలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు



మోత్కూరు మండలం ముశిపట్లలో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు



భువనగిరి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

కాంగ్రెస్ పార్టీకే బ్రాహ్మణుల మద్దతు

- అఖిల బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు

రామగిరి(నల్లగొండ): లోక్‌సభ ఎన్నికల్లో బ్రాహ్మణులందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నట్లు అఖిల బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో బ్రాహ్మణ సమస్యలు పరిష్కరించబడతాయని అన్నారు. బ్రాహ్మణ సమాజం అంతా ఏకతాటి పైకి వచ్చి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి అక్కెల శ్రీనివాస్, ఫణి ఆచార్య, గొల్లపూడి మారుతీశర్మ, పులిజాల యాదగిరిరావు, తుమ్మగోటి పవన్‌కుమార్, తేనేపల్లి శేఖర్, దర్వెల్లి రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అఖిల బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలరావు

ఖర్చుల లెక్కలను తనిఖీ చేయించుకోవాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్ కుమార్ దాస్

నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ తమ ఎన్నికల ఖర్చులకు సంబంధించిన లెక్కలను తనిఖీ చేయించుకోవాలని నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్ కుమార్ దాస్ అన్నారు. శనివారం నల్లగొండ కలెక్టరేట్ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల మూడో విడత తనిఖీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంకా ఎవరైనా అభ్యర్థులు ఖర్చులకు సంబంధించి రిజిస్టర్లు, ఖర్చులు సంబంధించిన వివరాలు మిగిలిపోయినట్లయితే తనిఖీ చేయించుకోవాలని, అలాగే జూన్ 30వ తేదీన నిర్వహించే కన్సాలిడేడ్ తనిఖీకి సైతం అభ్యర్థులందరూ హాజరుకావాలని సూచించారు. కాగా ఈ తనిఖీకి 22 మంది అభ్యర్థులు, వారి తరఫున ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో సహాయ వ్యయ పరిశీలకుడు సురేష్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సంక్షేమ పథకాలు

చండూరు: కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తేనే ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. శనివారం చండూరు మున్సిపల్ పరిధిలోని అంగడిపేట గ్రామంలో నిర్వహించిన కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నర్సింహ, ఓబీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం, జిల్లా నాయకులు సముద్రాల వెంకన్న, బోడ ఆంజనేయులు, బూతరాజు శ్రీహరి, సోమ శంకర్, మాదగోని స్వామి, పేర్ల గణేష్, తడకమల్ల శ్రీధర్, ప్రధాన కార్యదర్శులు బొబ్బల శివ, దుస్స గణేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

● ఓటు హక్కుపై అవగాహన



నల్లగొండ: ఓటర్ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరిచందన, ఎన్నికల పరిశీలకులు



నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్‌లో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు, ట్రాన్స్‌జెండర్స్



తుంగతుర్తి: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎన్నికల సిబ్బంది



నల్లగొండ: క్యాండిల్ వాక్‌లో పాల్గొన్న ట్రాన్స్‌జెండర్లు

ఓటేసేందుకు వెళ్తున్నాం..



చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు



నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై హోటళ్ల వద్ద ఆగిన వాహనాలు

- ఈ ఎన్నికలు మాకు ఎంతో ముఖ్యం
- ఆంధ్రప్రదేశ్ వాసుల వెల్లడి

చౌటుప్పల్ : ఓటు వేసేందుకు ప్రజలు స్వగ్రామాల బాటపట్టారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు మాత్రమే జరుగుతుండగా ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభతో పాటు అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలలో నివాసం ఉండే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రజలు ఓటు వేసేందుకుగాను సొంతూళ్ల బాటపట్టారు. వరుస సెలవులు సైతం కలిసిరావడంతో కుటుంబాలతో కలిసి బయలుదేరారు. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద పలువురు 'సాక్షి'తో మాట్లాడారు.

గొప్ప ఆశయం కోసం వెళ్తున్నాము



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు పార్టీలకే కాకుండా ప్రజలకు సైతం ఎంతో ప్రతిష్టాత్మకమైనవిగా చెప్పవచ్చు. అలాంటి ఈ ఎన్నికల్లో తప్పనిసరిగా ఓట్లు వేయాల్సి ఉంటుంది. ఎంత దూరంలో ఉన్నా గొప్ప ఆశయం కోసం సొంతూరికి బయలుదేరాము. ఓటు వేసి ఆశయాన్ని గెలిపించుకుంటాము. - బాబుగౌడ్, నర్సాపురం, పశ్చిమగోదావరి

కుటుంబంతో కలిసి వెళ్తున్నాము



మా సొంతూరిలో ఓటు వేయాలని ముందుగానే నిర్ణయించుకున్నాము. ఆ ప్రకారంగా ముందే సెలవులు సైతం రావడంతో కుటుంబంతో కలిసి వెళ్తున్నాము. అసెంబ్లీ ఎన్నికలు ఎంతో ముఖ్యం.

- విజయ్, కొత్తపేట, కోనసీమ జిల్లా

ఓటు వేసేందుకు వెళ్తున్నాము



మేము కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటాము. ఓటు మాత్రం మా సొంతూర్లో ఉంది. అసెంబ్లీ ఎన్నికలు కావడంతో కచ్చితంగా ఓటు వేయాలన్న సంకల్పంతో వెళ్తున్నాము.

- వెంకటేశ్వరరావు, చిలకలూరిపేట

ప్రతిసారి ఓటు వేస్తాను



ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి ఓటు వేస్తున్నాను. 2019 మాదిరిగానే అసెంబ్లీ, పార్లమెంట్‌కు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నాయి. కావున తప్పనిసరిగా ఓటు వేయాల్సి ఉంది. ప్రతిసారి ఓటుహక్కును వినియోగించుకుంటాను.

- వసంత్‌కుమార్, మైలవరం

ఫలితాలు తారుమారు కావొద్దని



ఎన్నికల్లో ఒక్క ఓటు ఎంతో కీలకంగా ఉంటుంది. ఒక్కోసారి ఒక్క ఓటుతోనే అభ్యర్థుల తలరాత మారుతుంది. దూర ప్రాంతాలలో నివాసం ఉండే వ్యక్తులు ఓటింగ్‌లో పాల్గొనకపోతే ఫలితాలు తారుమారు అయ్యే ప్రమాదం ఉంటుంది. అలాంటి పరిస్థితి రావొద్దని మేమంతా ఓట్లకు వెళ్తున్నాము.

- శ్రీధర్, విశాఖ ఈస్ట్

మంచి తీర్పు రావాలని



ఓటు వేయడం మన హక్కు. ఓటుతో చక్కటి అభ్యర్థిని ఎన్నుకోవచ్చు. మార్పు కోరుకోవచ్చు. అందుకే అసెంబ్లీ నియోజకవర్గంలో మేము ఓటు వేసి మంచి అభ్యర్థిని గెలిపించుకోవాలని నిర్ణయించుకున్నాము. ఆ మేరకు స్వగ్రామానికి బయలుదేరాము.

- మురళి, కాకినాడ

ఊరి నుంచి పిలుపు వచ్చింది



ఎన్నికల నేపథ్యంలో మా స్వగ్రామం నుంచి మాకు పిలుపు వచ్చింది. కచ్చితంగా ఓటు వేసేందుకు రావాలని వివిధ పార్టీల నాయకులు అడిగారు. ఓటు వేయడం మన హక్కు కాబట్టి కుటుంబసభ్యులందరం కలిసి వెళ్తున్నాము.

- గోపాల్, నందిగామ, కృష్ణాజిల్లా

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

- దోరకుంట వద్ద భర్త మృతి.. భార్యకు గాయాలు
- కోటినాయక్‌తండా వద్ద మరో వ్యక్తి..
- సూర్యాపేట జిల్లా పరిధిలో ఘటనలు

కోదాడ రూరల్: జిల్లాలో వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. మరొక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలు శనివారం చోటుచేసుకున్నాయి. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండలం రంగయ్యగూడెం గ్రామానికి చెందిన ఎర్రపు వీరబాబు(45) తన భార్య రజినితో కలిసి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై దోరకుంటలోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో దోరకుంట వద్దకు వెళ్లిన తర్వాత వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం వీరు ప్రయాణిస్తున్న టీవీఎస్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వీరబాబుకు తీవ్రగాయాలు కాగా రజినికి స్వల్పగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరబాబు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కాగా వారి కుమారుడు ఇటీవలే బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడి భార్య రజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు.



వీరబాబు (ఫైల్)



షేక్ సైదా(ఫైల్)

ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొని..

ఆత్మకూర్(ఎస్): మండలంలోని కోటినాయక్ తండా వద్ద శుక్రవారం రాత్రి బైక్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కాశీగూడెం గ్రామానికి చెందిన షేక్ సైదా (32) వ్యక్తిగత పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో రాత్రి 11గంటల సమయంలో మండల పరిధిలోని కోటినాయక్ తండా వద్దకు రాగాను తాను నడుపుతున్న బైక్.. దంతాపల్లి నుంచి సూర్యాపేట వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న సైదా తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు సైదాకు భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని తల్లి షేక్ బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ వై.సైదులుగౌడ్ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి క్రైం: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బీబీనగర్-పగిడిపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్యలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ జె.కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం బీబీనగర్-పగిడిపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య గల 228/5-7 ఎగువ లైన్‌పై వెళ్తున్న రైలు కింద సుమారు 40 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని బూడిదరంగు నైట్ ప్యాంటు, బ్లాక్ టీషర్ట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు 9848223169, 8712568454 నంబర్లలో తెలపాలని కోరారు.

రైలు నుంచి కిందపడి మరొకరు మృతి

నార్కట్‌పల్లి: గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి కింద పడి మృతి చెందిన సంఘటన శనివారం నార్కట్‌పల్లి-చిట్యాల మధ్య 56వ ట్రాక్ పక్కన చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రైల్వే ట్రాక్ పక్కన ఒక గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు చిట్యాల స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందింది. దీంతో రైల్వే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. రైలు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడని గుర్తించినట్లు తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు, అతనికి దాదాపు 30 నుంచి 40 వయస్సు ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రజిత తెలిపారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

భార్య తరఫు బంధువుల దాడిలో భర్త మృతి

- నల్లగొండ జిల్లా కేంద్రంలో ఘటన

నల్లగొండ క్రైం: భార్య తరఫు బంధువుల దాడిలో భర్త మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. నల్లగొండ పట్టణంలోని బీటీఎస్ శ్రీనివాస కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న సయ్యద్ వలీ (40) భవన నిర్మాణ రంగంలో కూలి పనులు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఇతని భార్య బీబీ ఇంటి వద్దే ఉండేది. రోజు మద్యం తాగి వచ్చి గొడవ పడుతున్నాడని వలీ భార్య తన అల్లుడు రిజ్వాన్‌కు శనివారం ఫోన్ చేసి చెప్పింది. దీంతో రిజ్వాన్ తన స్నేహితుడైన నవీన్, సాజిద్‌లను వెంట తీసుకుని వలీ ఇంటికి వచ్చి అతనితో వాగ్వాదానికి దిగి దాడి చేశారు. ఈ క్రమంలో వలీని తలపై కర్రతో కొట్టడంతో తీవ్ర గాయమై రక్తస్రావం అవుతూ కిందపడ్డాడు. దీన్ని గమనించిన ఇంటి పక్కవారు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా వాహనం రావడంతో సయ్యద్ వలీని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆస్పత్రి అవుట్ పోస్టు నుంచి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు భార్య బీబీని పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. గొడవ జరిగిన సమయంలో తాను లేనని తర్వాత విషయం తెలిసిందని పోలీసులకు తెలిపింది. దీంతో మృతుడు భార్య బీబీతో పాటు రిజ్వాన్, నవీన్, సాజిద్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌కు పితృవియోగం

దేవరకొండ: దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ తండ్రి రమావత్ కసీలాల్ శనివారం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఆస్పత్రిలోనే మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆస్పత్రికి చేరుకొని కసీలాల్ పార్థీవదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేటీఆర్ వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులున్నారు. కాగా కసీలాల్ 2019లో దేవరకొండ మండల పరిధిలోని రత్యతండా సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.



కసీలాల్ పార్థీవదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పిస్తున్న కేటీఆర్

చెరువులో పడి మహిళ మృతి

సూర్యాపేట: సద్దుల చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన శనివారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు మోతె శ్రీనివాస్ సతీమణి రమాదేవి(45) మానసిక స్థితి కొంతకాలంగా బాగుండడం లేదు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వచ్చిన రమాదేవి స్థానిక సద్దుల చెరువులో పడి శవంగా తేలింది. స్థానికులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉండగా అందరు విదేశాల్లో స్థిరపడ్డారు.